


సోమశిలలో నీటి నిల్వ

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో మంగళవారం సాయంత్రానికి 22.546 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 648 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా) -	రూ.60,840
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా) -	రూ.5,480
3 శాతం జీఎస్టీతో.. -	రూ.5,644
నవర (8 గ్రా) -	రూ.45,152

వాతావరణం

గరిష్టం/కనిష్టం
35.6 /28.6

మంగళవారం గాలిలో తేమ 49 శాతం ఉంది. బుధవారం ఎండతీవ్రత, ఉక్కపోత, ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటాయని వాతావరణశాఖ అధికారులు తెలిపారు

కార్డులెస్.. లైసెన్స్



వాహనంపై వెళుతున్నప్పుడు ఎక్కడో ఒకచోట విధుల్లో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్ లేదా రవాణాశాఖ అధికారులు ఆపి డ్రైవింగ్ లైసెన్స్, ఆర్‌సీ చూపించు అని అడుగుతుంటారు. ఆ సమయంలో పత్రాలు అందుబాటులో లేని వాళ్లు సార్ ఇంట్లో పెట్టి వచ్చాననో, మర్చిపోయాననో చెప్పి అక్కడి నుంచి బయటపడుతుంటాం. కానీ ఇక నుంచి ఆ ఇబ్బంది లేదు. డ్రైవింగ్ లైసెన్స్‌ల జారీకి రవాణాశాఖ నూతన విధానాన్ని తీసుకొచ్చింది. డ్రైవింగ్ లైసెన్స్, ఆర్‌సీ వంటివి మన ఫోన్‌లోనే భద్రపరుచుకుని, తనిఖీల సమయంలో చూపించే వెసులుబాటు కల్పించింది.

ఆగస్టు ఒకటి నుంచే నూతన విధానం

- ఇక ఆన్‌లైన్‌లోనే అన్ని పత్రాలు
- వాహనదారుడే ప్రింట్ తీసుకునే అవకాశం
- ఫోన్‌లో సేవ్ చేసుకుని అధికారులకు చూపే వెసులుబాటు

కందుకూరు: డ్రైవింగ్ లైసెన్స్‌లు, వాహనాల ఆర్‌సీల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి రవాణాశాఖ ఇటీవల వరకు డ్రైవింగ్ టెస్టులు నిర్వహించి లైసెన్స్‌లు జారీ చేసేది. టూ వీలర్, ఫోర్ వీలర్, హెవీ వెహికల్ లైసెన్స్‌లు.. ఇలా పలురకాల లైసెన్స్‌లను మంజూరు చేసేది. ఇందుకోసం రవాణా శాఖ ప్రత్యేకంగా తయారు చేసిన కార్డులను ప్రింట్ చేసి లైసెన్స్ కార్డులుగా ఇప్పటి వరకు ఇస్తూ వచ్చింది. దీని కోసం పోస్టల్ చార్జీలు, లైసెన్స్ ఫీజు కింద రూ.235 వరకు చెల్లించాల్సి ఉండేది. అయితే ప్రస్తుతం రవాణాశాఖ ఈ విధానానికి స్వస్తి పలికింది. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా కొత్త విధానాన్ని ఆగస్టు 1వ తేదీ నుంచి అమల్లోకి తెచ్చింది. దీని ప్రకారం కార్డు లెస్ డ్రైవింగ్ లైసెన్స్‌లను మంజూరు చేస్తున్నారు. లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకున్న వాహనదారుడికి అన్ని డ్రైవింగ్ టెస్టులు నిర్వహించిన తరువాత లైసెన్స్‌ను మంజూరు చేస్తారు. అయితే నూతన విధానంలో ఎలాంటి కార్డులు ఇవ్వకుండా కేవలం ఆన్‌లైన్‌లో రవాణాశాఖ మంజూరు చేసిన లైసెన్స్ పత్రాలను వాహనదారుడి ఫోన్‌కు పంపుతారు. ఆ పత్రాలను వాహనదారుడే నేరుగా ప్రింట్ తీసుకోవచ్చు లేదా తన ఫోన్‌లోనే భద్రపరుచుకోవచ్చు. అధికారులు అడిగినప్పుడు ఫోన్‌లోనే తన డ్రైవింగ్ లైసెన్స్‌ను చూపే అవకాశాన్ని కల్పించారు. ఈ విధానంలో లైసెన్స్ కోసం వాహనదారుడు ఎలాంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు.

దేశంలో ఎక్కడైనా తనిఖీకి వీలు

దేశం మొత్తం ఒకే డ్రైవింగ్ లైసెన్స్ ఉండేలా కేంద్ర ప్రభుత్వం నూతన విధానాన్ని తీసుకొచ్చింది. ఈ విధానాన్ని రాష్ట్రాల్లో అమలు చేయాలా వద్దా అనే వెసులుబాటును రాష్ట్ర ప్రభుత్వాలకే వదిలేసింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ విధానానికి అనుగుణంగా నూతన డ్రైవింగ్ లైసెన్స్ విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. ఈ లైసెన్స్ పత్రాలను మన ఫోన్‌లో, డిజి లాకర్‌లోనూ భద్రపరుచుకోవచ్చు. రవాణాశాఖ మంజూరు చేసే ఈ పత్రాలను దేశంలో ఎక్కడైనా తనిఖీల సమయంలో అధికారులకు చూపించవచ్చు. సదరు అధికారికి ఏదైనా సందేహం ఉంటే వెంటనే ఆన్‌లైన్‌లో చెక్ చేస్తే సదరు వాహనదారుడికి సంబంధించి పూర్తి సమాచారం ఉంటుంది. పాత విధానంలో ఈ సదుపాయం ఉండేది కాదు. వాహనదారుడి వివరాలు తెలుసుకోవడం, లైసెన్స్ సరైనదా కాదా అని పరిశీలించడం కాస్త కష్టతరంగా ఉండేది. కానీ నూతన విధానంలో తనిఖీ అధికారులు వాహనదారుడి పూర్తి సమాచారం క్షణాల్లో పొందవచ్చు. ఈ విధానం తనిఖీలకు సులభతరంగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు.



వాహన తనిఖీ నిర్వహిస్తున్న ఎంవీఐ రఫీ (ఫైల్)

డ్రైవింగ్ లైసెన్స్‌కి కార్డులు ఉండవు



నూతన విధానంలో లైసెన్స్‌ల మంజూరు చేసిన తరువాత ఎలాంటి ప్రింటెడ్ కార్డులు ఇవ్వరు. కేవలం ఆన్‌లైన్‌లో మాత్రమే లైసెన్స్ పత్రాలను పంపుతారు. వీటిని వాహనదారుడు ప్రింట్ తీసుకుని తన వద్ద ఉంచుకోవచ్చు. అలాగే ఫోన్‌లో కూడా భద్రపరుచుకోవచ్చు. అధికారుల తనిఖీల సమయంలో ఈ పత్రాలను చూపితే సరిపోతుంది.

– ఎస్‌కే ఎండీ రఫీ, ఎంవీఐ, కందుకూరు

వాస్తవాలు దాచిపెట్టి..
అబద్ధాల ప్రచారం



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- కండలేరు ఎత్తిపోతలకు విద్యుత్ సరఫరా ఆపలేదు
- సోమిరెడ్డి దిగజారి విమర్శలు చేస్తున్నారు
- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు: 'కండలేరు ఎత్తిపోతల పథకానికి విద్యుత్ సరఫరా ఆపలేదు. కాలువకు ఎప్పుడు నీరు విడుదల చేయాలన్నా ఎలాంటి ఇబ్బంది లేదు. అయితే టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వాస్తవాలు దాచిపెట్టి అబద్ధాలను ప్రచారం చేస్తున్నారు.' అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కండలేరు ఎడమగట్టు కాలువ వెంబడి నిమ్మ, మామిడి తోటలను మంగళవారం అధికారులతో కలిసి మంత్రి పరిశీలించారు. అనంతరం జలాశయం లో లెవల్ స్లూయిజ్ వద్ద ఉన్న ఎత్తిపోతల పథకాన్ని తనిఖీ చేసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సోమిరెడ్డి దిగజారి విమర్శలు చేస్తున్నట్లు చెప్పారు. ఆయన మంత్రిగా చేసిన సమయంలో 2017 నుంచి 2019 వరకు స్కీమ్‌ను ప్రారంభించి హెవీ మోటార్లను ఉపయోగించడంతో రూ.3.56 కోట్ల విద్యుత్ బిల్లులు బకాయి పడ్డారన్నారు. తమ హయాంలో రూ.1.24 కోట్లు కాగా సీసీ చార్జెస్ రూపంలో రూ.4.80 కోట్లు వేశారన్నారు. మొత్తంగా చూసుకుంటే రూ.9 కోట్లు దాటిందన్నారు. సోమిరెడ్డి వాస్తవాలను దాచిపెట్టి ఎత్తిపోతల పథకం విద్యుత్ బిల్లులు చెల్లించలేదని, అందువల్ల కాలువకు నీటిని విడుదల చేయకపోవడంతో పంటలు ఎండుతున్నట్లు దుష్ప్రచారానికి దిగాడన్నారు. విద్యుత్ అధికారులు ప్రభుత్వం పథకాలకు సంబంధించి బిల్లులు చెల్లించకుంటే సరఫరా నిలిపివేయరన్నారు. ప్రధానంగా సాగు, తాగునీటి విషయంలో విద్యుత్‌ను ఆపే ప్రసక్తే లేదన్నారు. కాలువ నీటి కోసం రైతులెవరూ ఎదురుచూడడం లేదని, ఎక్కడా తోటలు ఎండిన దాఖలాల్లేవన్నారు. కాలువకు నీరు అవసరమైతే ముందుగా రైతులు తన దృష్టికి తీసుకొస్తే అధికారులతో మాట్లాడి విడుదల చేయిస్తున్నట్లు చెప్పారు.

జలాశయం సీపేజీ వల్ల ఎండిన తోటలు

కండలేరు జలాశయం సీపేజీ వాటర్ వల్ల పులికల్లు గ్రామానికి చెందిన ఎనిమిరెడ్డి పెంచలరెడ్డి, పలుకూరు వెంకటరమణారెడ్డి, కడపల పెంచలరెడ్డి, ఆరిక పెంచలనర్సారెడ్డిల 12 ఎకరాల నిమ్మతోటలు ఎండుముఖం పట్టాయని మంత్రి అన్నారు. టీడీపీ నాయకులు వారి అనుకూల మీడియాకు ఫొటోలు ఇచ్చి పంటలు ఎండుతున్నట్లు రాయించారని తెలిపారు. అధికారులు పరిశీలించి సీపేజీ వాటర్ వల్ల వేరుకుళ్లు తెగులుతో ఎండుతున్నట్లు వెల్లడించారన్నారు. మంత్రి వెంట తెలుగుగంగ ఈఈ అనిల్‌కుమార్‌రెడ్డి, జిల్లా ఉద్యానాధికారి సుబ్బారెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి సుధాకర్‌రాజు, వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ తెనాలి నిర్మలమ్మ, జేసీఎస్ కన్వీనర్ బచ్చల సురేష్ కుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ పెదమల్లు రమణారెడ్డి, ఏఎంసీ చైర్మన్ వై.పెంచలరెడ్డి, చుట్టుపక్కల గ్రామాల రైతులున్నారు.

న్యూస్‌రీల్

నేడు ప్రత్యేక వైద్యబృందం రాక

నెల్లూరు(సెంట్రల్): నెల్లూరు సర్వజన వైద్యశాలను పరిశీలించేందుకు ఒంగోలు నుంచి ప్రత్యేక వైద్యబృందం నెల్లూరుకు రానుంది. ప్రధానంగా ప్రభుత్వ వైద్యశాలలోని అత్యవసర చికిత్స విభాగాన్ని పరిశీలించనున్నారు. నిత్యం ఎంతమందికి వైద్యం అందుతుంది.. అందుకు అవసరమైన వైద్యులు ఉన్నారా.. తదితర అంశాలను పరిశీలించనున్నారు. ఏఏ విభాగంలో వైద్యుల కొరత ఉందనే విషయంపై స్పష్టత తీసుకోనున్నారు.

జిల్లా సర్కిల్ ఎస్‌ఈగా విజయన్



నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్‌ఈగా వి.విజయన్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు జిల్లా పుంగనూరులో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(ఈఈ)గా విధులు నిర్వహిస్తున్న ఆయనను పదోన్నతిపై జిల్లా సర్కిల్ ఎస్‌ఈగా నియమిస్తూ సోమవారం రాత్రి ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు ఉత్తర్వులు జారీ చేశారు. మంగళవారం నగరంలోని విద్యుత్‌భవన్‌లోని తన చాంబర్‌లో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని వినియోగదారులకు మెరుగైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటామని, విద్యుత్ ప్రమాదాల నివారణకు ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. అనంతరం విద్యుత్‌శాఖ ఈఈ, డిప్యూటీ ఈఈలు, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్లు, అసిస్టెంట్ ఇంజినీర్లు, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్లు, పలు యూనియన్లు, అసోసియేషన్ల నాయకులు ఎస్‌ఈని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఇళ్ల నిర్మాణాల పరిశీలన



ఇళ్ల నిర్మాణాలపై అధికారులతో చర్చిస్తున్న హౌసింగ్ పీడీ నాగరాజు

వెంకటాచలం: స్థానిక జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను హౌసింగ్ పీడీ నాగరాజు మంగళవారం పరిశీలించారు. జగనన్న కాలనీలో తాగునీరు, రోడ్లు, విద్యుత్ సౌకర్యం తదితర అంశాల గురించి స్థానిక అధికారులతో చర్చించారు. లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్లు నిర్మించుకునేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట డీఎల్‌డీఓ వసుమతి, ఎంపీడీఓ వెంకటరమేష్, హౌసింగ్ ఏఈ సీహెచ్ వెంకటేశ్వర్లు, ఏపీఓ సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు టిడ్కో ఇళ్ల కేటాయింపు

నెల్లూరు సిటీ: నగరపాలక సంస్థ పరిధిలోని టిడ్కో గృహాలను అర్హులైన వారికి కేటాయించాలని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. నగరంలోని కార్పొరేషన్ కార్యాలయంలో మెప్మా, కార్పొరేషన్, హౌసింగ్ విభాగాల అధికారులతో మంగళవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గృహాలు తీసుకునేందుకు అయిష్టత చూపిన లబ్ధిదారుల స్థానంలో కొత్త వారిని ఎంపిక చేయాలని సూచించారు. గృహాలు తీసుకున్న వారి నుంచి స్పందన లేకపోతే వారికి నోటీసులు జారీ చేసి కొత్త వారికి కేటాయించాలన్నారు.

సకాలంలో రుణ చెల్లింపులు

- డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి



మాట్లాడుతున్న పీడీ సాంబశివారెడ్డి

ఇందుకూరుపేట: స్వయం సహాయక సంఘాల సభ్యులు జీవనోపాధిని మెరుగుపరుచుకోవడం ద్వారా రుణ చెల్లింపులు సకాలంలో చేయవచ్చని డీఆర్‌డీఏ పీడీ కేవీ సాంబశివారెడ్డి తెలిపారు. రానున్న ఐదేళ్లలో కుటుంబం, గ్రామం ఎలా వృద్ధి చెందాలన్న అంశంపై ఇందుకూరుపేటలోని మండల సమాఖ్య కార్యాలయంలో మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ రుణ చెల్లింపు ఆధారంగా సంఘాల పరపతిని గణనీయంగా పెంచుకోవచ్చన్నారు. వంద శాతం చెల్లింపుల ద్వారా ఎక్కువ మొత్తం రుణాలు పొంది మెరుగైన జీవనోపాధి పొందవచ్చన్నారు. ప్రతి సభ్యురాలు విధిగా ప్రభుత్వ పథకాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఐబీ డీపీఎం కామాక్షి, ఏపీఎం రవిశంకర్‌రెడ్డి, సీసీలు, సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

రూ.2 కోట్ల దారి దోపిడీ కేసు ఛేదింపు

- ఆరుగురు నిందితుల అరెస్ట్
- నిందితుల్లో ఇద్దరు ఏఆర్ పోలీసులు
- రూ.1.81 కోట్ల నగదు రికవరీ
- 2 కార్లు, 8 సెల్‌ఫోన్లు స్వాధీనం

అనంతపురం శ్రీకంఠం సర్కిల్: జాతీయ రహదారి–44పై సంచలనం రేపిన రూ.2 కోట్ల దారి దోపిడీ కేసును 'అనంత' పోలీసులు ఛేదించారు. ఆరుగురు నిందితులను అరెస్ట్ చేశారు. వీరిలో ఇద్దరు ఏఆర్ పోలీసులు ఉండడం గమనార్హం. వీరి నుంచి రూ.1.81 కోట్ల నగదు రికవరీ చేశారు. రెండు కార్లు, ఎనిమిది సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్పీ కె.శ్రీనివాసరావు మంగళవారం మీడియాకు వెల్లడించారు. ఆగస్టు 22న ఎస్‌ఆర్‌ఆర్ కన్‌స్ట్రక్షన్ కంపెనీకి చెందిన రూ.2 కోట్ల నగదుతో కంపెనీ ప్రతినిధులు ఇన్నోవా వాహనంలో బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు బయలుదేరారు. సాయంత్రం 5 గంటల సమయంలో గార్లదిన్నె మండలం తలగాసిపల్లి సమీపంలోని 44వ జాతీయ రహదారిపైకి రాగానే కొందరు పోలీసు దుస్తుల్లో వచ్చి అటకాయించారు. రూ.2 కోట్ల నగదు బ్యాగును తీసుకుని ఉడాయించారు.

దోపిడీ ఘటనపై ఎస్‌ఆర్‌ఆర్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ పరిపాలనాధికారి శ్రీపతిరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గార్లదిన్నె పోలీసులు కేసు నమోదు చేశారు. దోపిడీకి సంబంధించి తొలుత ఎలాంటి ఆధారాలూ లభించలేదు. కేసును ఎస్పీ కె.శ్రీనివాసరావు చాలెంజింగ్‌గా తీసుకుని రంగంలోకి నాలుగు ప్రత్యేక బృందాలను దింపారు. 'సెబ్' అదనపు ఎస్పీ రామకృష్ణతోపాటు అనంతపురం రూరల్ డీఎస్పీ శివారెడ్డి ఆధ్వర్యంలో దుండగుల కోసం గాలింపు చేపట్టారు.

నిందితుల గుర్తింపు

దారి దోపిడీ కేసుకు సంబంధించి ఆరుగురు నిందితులను పోలీసులు గుర్తించారు. నిందితుల్లో వైఎస్సార్ జిల్లా ఖాజీపేట మండలం మల్లాయపల్లికి చెందిన కారపురెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, కడపకు చెందిన వేంపల్లి సూర్యనారాయణరాజు, ఏఆర్ కానిస్టేబుల్ చేమర్తి సుబ్బరామరాజు అలియాస్ సుబ్బరాజు, నెల్లూరు జిల్లాకు చెందిన హైదరాబాద్ ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ కుంచె వెంకటేశ్వర్లు అలియాస్ వెంకటేష్, రంగారెడ్డి జిల్లాకు చెందిన బండ్లగూడజాగీర్ వాసి గుర్రాల విజయ్‌కుమార్, హైదరాబాదులోని మాదాపూర్ పర్వతనగర్‌కు చెందిన చెంజీ రేవంత్‌కుమార్ ఉన్నారు.



దోపిడీకి వ్యూహకర్త ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్

దారి దోపిడీకి హైదరాబాద్ ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ కుంచె వెంకటేశ్వర్లు అలియాస్ వెంకటేష్ వ్యూహకర్త. ఇతనికి ఎస్‌ఆర్‌ఆర్ కంపెనీలో డ్రైవరుగా పనిచేసే రంగారెడ్డి జిల్లాకు చెందిన గుర్రాల విజయ్‌కుమార్, అన్నమయ్య జిల్లాకు చెందిన చెంజీ రేవంత్‌కుమార్‌తో పరిచయమైంది. ఈ పరిచయమే రూ.2 కోట్ల దోపిడీకి దారి తీసింది. పెద్ద మొత్తంలో వచ్చే నగదు, వాహనాలు, ఇతర సమాచారాన్ని విజయ్‌కుమార్ ద్వారా తెలుసుకుని దోపిడీకి తెగబడ్డారు. ఈ క్రమంలో వేణుగోపాల్‌రెడ్డిని వెంకటేష్ కలిసి దారి దోపిడీకి ప్రణాళిక రచించారు. మరికొందరిని కలుపుకొని ప్రణాళికను అమలు చేయాలని భావించారు. అందులో భాగంగా ఏఆర్ కానిస్టేబుల్ సుబ్బరామరాజుతోపాటు మహేశ్వరరాజును కలుపుకుని ఆగస్టు 22న కడప నుంచి అనంతపురం బయలుదేరి వచ్చారు. ఎస్‌ఆర్‌ఆర్ కంపెనీ డ్రైవర్ ఇచ్చిన సమాచారంతో గార్లదిన్నె మండలం తలగాసిపల్లి వద్ద కాపు కాశారు. పోలీసు దుస్తుల్లో రంగంలోకి దిగి.. డబ్బుతో వస్తున్న ఇన్నోవా కారును ఆపి కంపెనీ పరిపాలనాధికారి శ్రీపతిరావు, అనుపమరావు, డ్రైవర్ శివను భయపెట్టి.. వాహనంలో తరలిస్తున్న రూ.2 కోట్ల నగదున్న బ్యాగును తీసుకుని పరారయ్యారు. దోపిడీ సొమ్మును పంచుకున్నారు. రంగంలోకి దిగిన పోలీసులు నిందితుల కోసం దర్యాప్తు వేగవంతం చేశారు. అందిన సమాచారం మేరకు.. కడప శివారులో తిరుపతి హైవే పక్కన నిరుపయోగంగా ఉన్న దాబా వద్ద ఉన్న ఆరుగురు నిందితులు కారపురెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, సూర్యనారాయణరాజు, సుబ్బరామరాజు, కుంచె వెంకటేశ్వర్లు, గుర్రాల విజయకుమార్, చెంజీ రేవంత్‌కుమార్‌లను అరెస్ట్ చేశారు. వీరి వద్ద నుంచి రూ.1.81 కోట్ల నగదుతోపాటు 2 కార్లు, 8 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కేసును సవాల్‌గా తీసుకుని చాకచక్యంగా నిందితులను అరెస్ట్ చేసిన పోలీసు బృందాన్ని ఎస్పీ అభినందించారు.

పెళ్లి సంబంధం కుదిర్చినట్లు నమ్మించి..

- రూ.50 వేల నగదు, 8 గ్రాముల బంగారు దోచుకున్న బ్రోకర్
- పోలీసులకు బాధితుల ఫిర్యాదు



పెళ్లిళ్ల బ్రోకర్ వెంకటసుబ్బమ్మ (ఫైల్)

ఆత్మకూరు: పెళ్లి సంబంధం కుదిర్చే బ్రోకర్‌గా చెప్పుకొని ఓ యువకుడి వద్ద రూ.50 వేల నగదు, 8 గ్రాముల బంగారు ఉంగరం దోచుకున్న వైనంపై ఆత్మకూరు పోలీసులకు బాధితులు మంగళవారం ఫిర్యాదు చేశారు. వివరాలు.. ఆత్మకూరు మండలం నల్లపరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కొలిరెడ్డి వెంకటేశ్వర్లుకు గతంలో వివాహమైంది. అమ్మాయి మానసికస్థితి బాగాలేకపోవడం, అనారోగ్యానికి గురికావడంతో విడాకులు తీసుకున్నారు. రెండో పెళ్లి కోసం వెంకటేశ్వర్లు ప్రయత్నిస్తున్న క్రమంలో వింజమూరు మండలం తురకపల్లికి చెందిన వెంకటసుబ్బమ్మ ఫోన్ ద్వారా పరిచయమైంది. తాను వివాహాలు కుదురుస్తుంటానని వెంకటేశ్వర్లుకు నమ్మబలికింది. గత రెండు నెలలుగా పలు సంబంధాల వివరాలు, ఫొటోలు చూపించింది. ఈ క్రమంలో గత నెలలో మచిలీపట్నం వద్ద ఓ పల్లెటూరుకు చెందిన సంబంధం వివరాలు వెంకటేశ్వర్లుకు తెలిపి సంబంధం చూసి అన్నీ కుదిరితే అప్పటికప్పుడే తాంబూలాలు మార్చుకొనేలా ఒప్పించింది. దీంతో వెంకటేశ్వర్లు తన సమీప బంధువును తీసుకొని వెంకటసుబ్బమ్మతో కలిసి మచిలీపట్నానికి వెళ్లారు. వెళ్లే దారిలో మరో ఐదుగురు పెళ్లిళ్లు కుదిర్చే వారేనంటూ వెంకటసుబ్బమ్మ పరిచయం చేసింది. వారు ఒంగోలు, బాపట్ల, విజయవాడలో వీరిని కలుసుకున్నారు. ఎట్టకేలకు మచిలీపట్నంలో సంబంధం చూపారు. ఇరువర్గాలు సమ్మతించాక అప్పటికప్పుడే నిశ్చయ తాంబూలాలు ఇచ్చిపుచ్చుకున్నారు. పెళ్లి కుమార్తెకు 8 గ్రాముల ఉంగరంతోపాటు పట్టు చీర ఇచ్చారు. పెళ్లి గత నెల 30వ తేదీ ఆత్మకూరులోని కాశీనాయన ఆశ్రమంలో జరిపించేలా ఇరువర్గాలు ఒప్పుకొని ఇందుకుగానూ పెళ్లి కుమార్తె తరఫు వారికి ఖర్చుల కోసం రూ.50 వేల నగదు ఇచ్చారు. పెళ్లి ముందు రోజు రాత్రి ఆత్మకూరుకు పెళ్లికుమార్తె, బంధువులు చేరుకొనేలా మాట్లాడుకున్నారు. సంబంధం కుదిర్చినందుకు బ్రోకర్ వెంకటసుబ్బమ్మకు ఖర్చుల కోసం రూ.10 వేలు, ఆమెతో తోడు వచ్చిన మిగిలిన ఐదుగురికి రూ.1000 చొప్పున వెంకటేశ్వర్లు ఇచ్చాడు. మచిలీపట్నంకు వెళ్లి వచ్చినందుకు కొంతమొత్తం ఖర్చయింది. అయితే 29వ తేదీ రావాల్సిన పెళ్లి కుమార్తె, బంధువులు రాకపోగా వారికేదో ఇబ్బంది ఏర్పడిందని, మరో ముహూర్తం ఏర్పాటు చేసుకొని పెళ్లి జరిగేలా చూద్దామని బ్రోకర్ వెంకటసుబ్బమ్మ తెలిపింది. దీంతో అనుమానం వచ్చిన వెంకటేశ్వర్లు ఫోన్‌లో సంప్రదించగా పొంతనలేని సమాధానాలు చెబుతూ వచ్చారు. పెళ్లి రద్దు చేసే పనైతే తాను ఇచ్చిన రూ.50 వేలు, ఉంగరం తిరిగి ఇవ్వాలని వెంకటేశ్వర్లు కోరాడు. అడిగిన ప్రతిసారీ సమాధానం దాటవేస్తూ సోమవారం తాము నగదు ఇవ్వబోమని, ఏమి చేసుకుంటారో చేసుకోండని బ్రోకర్‌తో పాటు మచిలీపట్నంకు చెందిన వారు చెప్పినట్లు బాధితుడు వాపోయాడు. విచారించగా తురకపాళేనికి చెందిన వెంకటసుబ్బమ్మ గతంలోనే ఇలాంటి మోసాలకు పాల్పడినట్లు తెలిసిందన్నారు. దీంతో మంగళవారం ఆత్మకూరు ఎస్సై ముత్యాలరావుకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.

ఓటర్ల జాబితా సవరణ పటిష్టంగా నిర్వహించండి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): ఓటర్ల జాబితాల ప్రత్యేక సంక్షిప్త సవరణ కార్యక్రమాన్ని పటిష్టంగా నిర్వహించడంతోపాటు నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా కలెక్టర్లను ఆదేశించారు. మంగళవారం విజయవాడలోని తన కార్యాలయం నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లతో సమావేశమయ్యారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సంక్షిప్త సవరణ కార్యక్రమంలో భాగంగా రీ వెరిఫికేషన్ ఆఫ్ డిలిషన్స్, రాజకీయ పార్టీలు సమర్పించిన చనిపోయిన, డూప్లికేట్, బోగస్ ఓట్ల జాబితాపై వివరణ, హౌస్ టూ హౌస్ వెరిఫికేషన్, పెండింగ్‌లో ఉన్న ఫాం– 6, 7, 8 వివరాలు తదితర అంశాలపై చర్చించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు నెల్లూరు కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్ నుంచి కలెక్టర్ ఎం.హరినారాయణన్ పాల్గొని జిల్లాలో చేపడుతున్న ఓటర్ల జాబితాల సంక్షిప్త సవరణ కార్యక్రమం వివరాలను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి వివరించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలో 2022 జనవరి 6వ తేదీ నుంచి వచ్చిన డెత్, షిఫ్టింగ్ కేసులు అన్నీ రీ వెరిఫికేషన్ చేసి నిర్దేశిత గడువు లోపు రీవెరిఫికేషన్ ప్రక్రియను పూర్తి చేయనున్నట్లు తెలిపారు. జేసీ కూర్మనాథ్, డీఆర్వో వెంకటనారాయణమ్మ పాల్గొన్నారు.

మీ చిట్టి చేతులతోటే మట్టి గణపతి తయారు చేయండి ఇలా..

సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో

SAKSHI
SAKSHI DIGITAL
MEDIA GROUP

ఆంధ్రప్రదేశ్
ANDHRA PRADESH
AP Pollution Control Board

వినాయకుని పుట్టినరోజు ... గణేశ్ చవితి పండుగ వస్తోంది! ఈ రోజున పెద్దవాళ్లు, పెద్ద పెద్ద పందిళ్ల నిర్వాహకులూ పెద్ద పెద్ద విగ్రహాలు తయారు చేసి భారీ ఎత్తున పూజించడం మీకు తెలుసు కదా... అయితే ప్రకృతి ప్రేమికుడైన గణనాయకుడు ప్రకృతి సిద్ధమైన, సులువుగా తిరిగి ప్రకృతిలో కలిసిపోయేలా ఉండే మట్టిగణపతి విగ్రహాలను పూజించే వారికే బోలెడన్ని ఆశీస్సులు అందిస్తాడని మీకు తెలుసు కదా... మట్టి గణపతిని మీ చిట్టి చేతులతో స్వయంగా మీరే తయారు చేసి పూజలో ఉంచి, గణపతికి ఇష్టమైన పిండివంటలు ఆరగింపజేసి, మీ కోరికలన్నీ కోరుకునే సమయం ఆసన్నమైంది. 'అయ్యో! మాకు విగ్రహం తయారు చేయడం రాదే అనో, మా దగ్గర బంకమట్టి లేదు కదా... ఇప్పుడెలా' అనో దిగులు పడకండి. మట్టిగణపతి విగ్రహం తయారు చేసే విధానాన్ని మేమే మీకు నేర్పిస్తాం. ప్రతి సంవత్సరం లాగే ఇప్పుడు కూడా సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారి సహకారంతో మట్టి గణపతి విగ్రహాల తయారీలో మీకు శిక్షణనిచ్చేందుకు ఉచిత శిబిరాన్ని నిర్వహిస్తోంది.

ఈ నెల 16వ తేదీన జరిగే ఈ కార్యక్రమంలో 5 నుంచి 16 సంవత్సరాల లోపు గల బాలలందరూ పాల్గొనవచ్చును. దీనికి ఎటువంటి రుసుము చెల్లించనక్కరలేదు. బంకమట్టిని నిర్వాహకులే ఉచితంగా సమకూర్చుతారు. అయితే మీరు చేయాల్సిందల్లా ఏమిటంటే... దిగువ తెలిపిన నంబర్లకు ఫోన్‌చేసి మీ పేర్లను నమోదు చేసుకోవడమే! ఈ శిబిరంలో పర్యావరణానికి మేలు చేసే విధంగా మట్టిని గణనాయకుని ప్రతిమలుగా రూపొందించే విధానాన్ని నేర్పిస్తారు. మరి ఇంకెందుకు ఆలస్యం..? మీరు కూడా ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, మీరు తయారు చేసిన వినాయక ప్రతిమలను ఇంటికి తీసుకు వెళ్లి పూజించండి. శిక్షణకు వచ్చేవారు పాత వాటర్‌బాటిల్, పాతవస్త్రం వెంటతీసుకు రావడం మాత్రం మరచిపోవద్దేం!

అవిఘ్నమస్తు, అభీష్ట సిద్ధిరస్తు.

శిబిరం చిరునామా:

అవెన్యూస్ సీనియర్ సెకండరీ స్కూల్,
పోలీస్ గ్రౌండ్ ఎదురుగా, బ్రహ్మానందపురం, నెల్లూరు.
తేదీ : 16-09-2023 (శనివారం)
సమయం : ఉ. 9.30 గం.ల నుంచి మధ్యాహ్నం 12.30 గం.ల వరకు.
రిజిస్ట్రేషన్లకు సంప్రదించవలసిన
ఫోన్ నంబరు : 9848997210

పాముకాటుకు గురైన వ్యక్తి మృతి

సంగం: పాముకాటుకు గురై ఆత్మకూరు వైద్యశాలలో చికిత్స పొందుతూ మండలంలోని మర్రిపాడు గ్రామానికి చెందిన లక్ష్మయ్య (65) అనే వ్యక్తి మృతిచెందాడు. దీనిపై మంగళవారం సంగం పోలీసులకు ఫిర్యాదు అందింది. వారి కథనం మేరకు.. మర్రిపాడు గ్రామానికి చెందిన రాగి లక్ష్మయ్య సోమవారం పొలంలో పనిచేస్తుండగా పాముకాటుకు గురయ్యాడు. కుటుంబసభ్యులు గుర్తించి లక్ష్మయ్యను 108 అంబులెన్స్‌లో ఆత్మకూరు వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అదేరోజు రాత్రి మృతిచెందాడు. మంగళవారం ఎస్సై నాగార్జునరెడ్డి లక్ష్మయ్య మృతదేహానికి పోస్టుమార్టం చేయించి కుటుంబసభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దగదర్తిలో 'జగనన్నకు చెబుదాం' వాయిదా

- రేపు నిర్వహణ

నెల్లూరు(దర్గామిట్ట): దగదర్తిలో బుధవారం తలపెట్టిన జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని అనివార్య కారణాలతో వాయిదా వేసి 14వ తేదీన నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ, నోడల్ ఆఫీసర్ చిరంజీవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రజలు గురువారం ఉదయం 10 గంటల నుంచి మండల పరిషత్ కార్యాలయంలో అర్జీలను కలెక్టర్‌కు నేరుగా అందజేయొచ్చన్నారు. జిల్లాస్థాయి, దగదర్తి మండల అధికారులు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు.

ప్రజలకు అండగా ఉండండి

- పరిశ్రమల యాజమాన్యాలకు మంత్రి కాకాణి సూచన
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు(పొగతోట): పరిశ్రమల కోసం భూములిచ్చిన ప్రజలకు యాజమాన్యాలు అండగా ఉండాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదేశించారు. పరిశ్రమలు, పవర్ ప్రాజెక్ట్‌లు ఏర్పాటు చేసుకుని లాభాలు ఆర్జిస్తున్న కొన్ని కంపెనీలు ప్రజలను పట్టించుకోవడంలేదంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. నెల్లూరు జెడ్పీ కార్యాలయంలో మంగళవారం అధికారులతో నిర్వహించిన సమీక్షలో మంత్రి మాట్లాడారు. పరిశ్రమలు ఇచ్చిన హామీల ప్రకారం సహకారం అందించకపోవడంతో ప్రజలు అసహనంగా ఉన్నారన్నారు. వారికి తమవంతు సహకారం అందించాలన్నారు. యాజమాన్యాలతో మాట్లాడి వెంటనే చెల్లించాల్సిన మొత్తంపై చర్యలు తీసుకోవాలని సూచించారు. పరిశ్రమలు స్థానిక యువతకు 75 శాతం ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నాయో లేదో పరిశీలించాని ఆ శాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ ఎం.హరినారాయణన్ మాట్లాడుతూ నేలటూరు పరిసర ప్రాంత ప్రజలకు భూమితోపాటు లెవలింగ్ చేసి ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. యాజమాన్యాలతో మాట్లాడి వెంటనే రూ.20 కోట్లు డిపాజిట్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో పేదల గృహ నిర్మాణాలపై స్పెషల్ డ్రైవ్ చేపట్టి వేగవంతంగా పూర్తి చేయాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. మండలాల వారీగా సమీక్షించారు. నిర్మాణాల్లో జాప్యం చేస్తున్న కాంట్రాక్టర్లపై కేసులు నమోదు చేయాలని సూచించారు. లబ్ధిదారుల వద్ద తీసుకున్న మొత్తం తిరిగి వెనక్కి ఇప్పించాలని, కట్టించే బాధ్యత ఏఈలు తీసుకోవాలని తెలిపారు. సమావేశంలో జేసీ కూర్మనాథ్, పరిశ్రమల శాఖ జీఎం సుధాకర్, ఆర్డీఓ మలోల, ఏపీ జెన్‌కో, వివిధ పరిశ్రమల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ రోడ్ల అభివృద్ధికి నిధులు



రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

- నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: రూరల్ నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయని, త్వరలో పనులు చేపట్టి పూర్తి చేయనున్నట్లు నెల్లూరు ఎంపీ, వైఎస్సార్‌సీపీ రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. రూరల్ మండలంలోని కందమూరు వద్ద రూ.4.26 కోట్లతో తలపెట్టిన రోడ్డు పనులకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ములుముడి రోడ్డు నిర్మాణానికి కూడా రూ.7 కోట్లు మంజూరైనట్లు వెల్లడించారు. త్వరలో పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఇవి పూర్తయితే రాకపోకలు సులభతరంగా జరుగుతాయన్నారు. గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ఇందుకోసం ప్రభుత్వం నుంచి అధికంగా నిధులు తీసుకొస్తామన్నారు. రూరల్లో ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ ఛైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, విజయ డెయిరీ ఛైర్మన్ రంగారెడ్డి, రైల్వే బోర్డు సభ్యుడు స్వర్ణా వెంకయ్య, మర్రిపాడు జెడ్పీటీసీ మల్లు సుధాకర్‌రెడ్డి, వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఛైర్మన్ వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, రూరల్ ఎంపీపీ విజయకుమార్, లంకా రామశివారెడ్డి, పాలకీర్తి రవి, చెవిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బెల్లంకొండ వెంకయ్య, పాతవెల్లంటి, కొత్తవెల్లంటి, గొల్లకందుకూరు, సజ్జాపురం, కందమూరు గ్రామాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

బాబు నిప్పు కాదు.. గజదొంగ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి, చిత్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు

- కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: 'చంద్రబాబు నాయుడు నేను నిప్పు అంటుంటారు. అయితే ప్రజలు ఆయన్ను గజదొంగలా చూస్తున్నారు.' అని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. కావలిలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. బాబు ముఖ్యమంత్రిగా పనిచేసి కాలంలో ఎన్నో అక్రమాలకు పాల్పడ్డాడని చెప్పారు. టీడీపీ అధినేత జీవితమంతా అవినీతిమయమన్నారు. చట్టం బాబు చుట్టం కాదన్నారు.. చట్టం తన పని తాను చేసుకుంటూ పోతుందని చెప్పారు. తెలుగుదేశం పార్టీకి ప్రజల్లో సానుభూతి లేదని తెలిపారు. అవినీతి చేసిన వ్యక్తి ఏ స్థాయి వాడైనా శిక్షార్హుడే అని ఆ పార్టీ శ్రేణులు గుర్తించాలన్నారు. చంద్రబాబు దేశంలోనే పెద్ద స్కిల్డ్ క్రిమినల్ అని, వ్యవస్థలను ఎలాగైనా మేనేజ్ చేయగలననే అహంకారంతోనే ఇన్నాళ్లు ఉన్నాడన్నారు. అందుకే చేతనైతే నిరూపించండి అంటూ మాట్లాడాడన్నారు. వ్యవస్థల్లో ఉన్న లొసుగులను ఉపయోగించుకుని ప్రభుత్వ సొమ్మును కాజేశాడన్నారు. బాబు చేసిన స్కామ్‌లు ఎన్నో ఉన్నాయన్నారు. సోమవారం రాష్ట్రంలో ఎలాంటి బంద్ జరగలేదని, టీడీపీ పిలుపును ప్రజలు పట్టించుకోకుండా యథావిధిగా వారి జీవనాన్ని కొనసాగించారని చెప్పారు. అక్రమ అరెస్ట్ అంటూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై టీడీపీ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. బాబు అరెస్ట్‌తో రాష్ట్రానికి పట్టిన దరిద్రం పోయిందని మహిళలు చెబుతున్నారన్నారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ నాయకులున్నారు.

సోషల్ మీడియాలో క్రీడాకారిణికి వేధింపులు

- కేసు నమోదు చేసిన పోలీసులు

నెల్లూరు(క్రైమ్): సోషల్ మీడియా వేదికగా క్రీడాకారిణి, ఆమె కుటుంబసభ్యులను వేధింపులకు గురిచేస్తున్న వ్యక్తిపై నెల్లూరు వేదాయపాళెం పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. నెల్లూరు నగరానికి చెందిన జాతీయ స్థాయి క్రీడాకారిణికి గతంలో చెన్నైకి చెందిన ఎలీషా అనే వ్యక్తి సూర్యారెడ్డి పేరుతో పరిచయమయ్యాడు. ప్రేమిస్తున్నానని నమ్మించాడు. అయితే అతడి ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండడంతో ఆమె ఆరా తీసింది. అతడి అసలు పేరు ఎలీషా అని, ఇదివరకే వివాహమై పిల్లలున్నట్లు తెలిసింది. దీంతో ఆమె అతడిని దూరంగా పెడుతూ వచ్చింది. అయితే అతను మాత్రం నానా రకాలుగా ఇబ్బందులకు గురిచేయడం ప్రారంభించాడు. క్రీడాకారిణితో స్నేహంగా ఉన్న సమయంలో తీసుకున్న ఫొటోలను ఆమె ఇంటి చుట్టుపక్కల అతికించడంతోపాటు ఫోన్‌ల్లో ఇబ్బందికరంగా మెసేజ్‌లు పెడుతూ వేధించసాగాడు. అంతేకాకుండా చంపేందుకు యత్నించగా గతేడాది మే నెలలో వేదాయపాళెం పోలీసులకు ఆమె ఫిర్యాదు చేశారు. వారు నిందితుడిపై కేసు నమోదు చేశారు. ప్రస్తుతం ఆ కేసు కోర్టులో ఉంది. జైలు నుంచి బెయిల్‌పై బయటకు వచ్చిన ఎలీషా ప్రవర్తనలో మార్పులేదు. ఈనెల 2వ తేదీన క్రీడాకారిణి ఫొటోలను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. అంతే కాకుండా ఆమె తల్లి, అక్క ఫొటోలను సేకరించి వాటిని సైతం అప్‌లోడ్ చేశాడు. వివిధ వ్యక్తుల ద్వారా క్రీడాకారిణి తల్లికి అసభ్యకరమైన మెసేజ్‌లు పంపుతున్నాడు. దీంతో బాధితురాలు ఎలీషాపై చర్యలు తీసుకోవాలని వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎవరూ లేని సమయం చూసి..



చిట్టెమ్మ ఇంట్లో కింద పడేసిన దుస్తులు

గుడ్లూరు: గుడ్లూరులోని మిట్టపాళెంలో సోమవారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. పోలీసుల కథనం మేరకు.. మిట్టపాళెంలో నివాసం ఉండే కందుల రమ, కందుల కాంతమ్మ తమ ఇళ్లకు తాళాలు వేసుకుని బంధువుల వద్దకు వెళ్లారు. అలాగే కందుల చిట్టెమ్మ అనే మహిళ సోమవారం రాత్రి తన ఇంటికి తాళం వేసి కొద్దిదూరంలో ఉన్న కూతురు ఇంటికి వెళ్లింది. మంగళవారం ఉదయం ఆమె వచ్చి చూడగా తాళం పగులగొట్టి ఉంది. బీరువా తలుపులు తెరిచి ఉండటంతో చుట్టుపక్కల వారికి తెలియజేసింది. అలాగే ఆమె ఇంటి పక్కనే ఉన్న రెండు ఇళ్లల్లో కూడా తలుపు తాళాలు పగులగొట్టి ఉండడాన్ని యువకులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై ప్రసాద్‌రెడ్డి మూడు గృహాలను పరిశీలించారు. చిట్టెమ్మ ఇంట్లో రూ.10 వేలు నగదును దొంగలు అపహరించినట్లు గుర్తించారు. అలాగే మిగిలిన రెండు గృహాల్లో నగదు లభించకపోవడంతో వస్తువులను కింద పడేసి దొంగలు వెళ్లిపోయినట్లు చెబుతున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రాంతంలో రాత్రి సమయంలో గస్తీని ముమ్మరం చేస్తామని ఎస్సై వెల్లడించారు.

లాడ్జి కేంద్రంగా గంజాయి విక్రయాలు

- ముగ్గురు వ్యక్తుల అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): లాడ్జి కేంద్రంగా గంజాయి విక్రయాలు సాగిస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. వారి నుంచి కేజీ గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం మేరకు.. కొడవలూరు మండలం గుండాలమ్మపాళేనికి చెందిన పి.రాజేష్, నెల్లూరు రూరల్ మండలం వసుదానగర్‌కు చెందిన కె.జనార్దన్, పొదలకూరురోడ్డు ఎన్‌బీటీ కాలనీకి చెందిన ఎస్.అనుదీప్, కోవూరుకు చెందిన కాన్షీరామ్‌లు స్నేహితులు. వీరు గంజాయికి బానిసయ్యారు. ఓ వైపు గంజాయి సేవనం చేస్తూ మరోవైపు గంజాయి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈనెల ఒకటో తేదీ నుంచి నిందితులు బృందావనంలోని ఓ లాడ్జిలో గదిని అద్దెకు తీసుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి గంజాయిని తీసుకొచ్చి వాటిని చిన్న పొట్లాలుగా చేసి విక్రయించసాగారు. దీనిపై సంతపేట ఇన్‌స్పెక్టర్ కళ్యాణ్‌రాజుకు సమాచారం అందింది. మంగళవారం ఆయన తన సిబ్బందితో కలిసి లాడ్జిపై దాడి చేశారు. పోలీసుల రాకను గమనించిన కాన్షీరామ్ పరారవగా మిగిలిన ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. నిందితులు ఎక్కడి నుంచి? ఎవరి ద్వారా గంజాయిని తీసుకొస్తున్నారు తదితర వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

టీఎస్ఎస్ఎఫ్ నాయకులపై కేసు

వెంకటాచలం: టీఎస్ఎస్ఎఫ్ నాయకులపై కేసు నమోదు చేసినట్లు వెంకటాచలం పోలీసులు మంగళవారం తెలిపారు. వారి కథనం మేరకు.. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్ కేసులో చంద్రబాబును అరెస్ట్ చేయగా సోమవారం టీడీపీ రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చింది. దీంతో టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు షేక్ అమ్ముల్లా, నాయకులు షేక్ వసీం, నవీన్‌రెడ్డి, నరేంద్ర, వెంకటేశ్వర్లు, మరికొందరు వెంకటాచలం మండల పరిధిలోని చెముడుగుంటలో చట్ట విరుద్ధంగా సమావేశమయ్యారు. టీఎన్ఎస్ఎఫ్ బ్యానర్ పట్టుకుని రెండు మోటార్ బైక్‌లపై చెముడుగుంట నుంచి కాకుటూరు వరకు జాతీయ రహదారిపై నిర్లక్ష్యంగా తిరుగుతూ ప్రయాణికులను భయభ్రాంతులకు గురిచేశారు. వాహనదారుల ప్రాణాలకు ముప్పు కలిగిలించేలా ప్రవర్తించారు. సీఎం దిష్టిబొమ్మను తయారు చేసి దానికి నిప్పు అంటించి తాడుతో కట్టి బైక్‌పై ఈడ్చుకుంటూ వెళ్లారు. ఫొటోలు, వీడియోలు తీసి సోషల్ మీడియాలో పెట్టారు. మొత్తం ఘటనపై కాకుటూరు వీఆర్వో పిట్ల నిరంజన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు టీఎస్ఎస్ఎఫ్ నాయకులపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 150
లేయర్ (లైవ్)	: 113
బ్రాయిలర్ చికెన్	: 256
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 284
లేయర్ చికెన్	: 192

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	: రూ.70
సన్నవి	: రూ.40
పండ్లు	: రూ.10